క్లుప్తంగా

అటెండర్‌ను ఘనంగా సత్కరించిన ఎమ్మెల్యే



బలభద్రపురంలో సత్యనారాయణ దంపతులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తిసూర్యనారాయణరెడ్డి

బిక్కవోలు: బలభద్రపురం గ్రామంలోని ఉన్నత పాఠశాల అటెండర్ జొన్నాడ సత్యనారాయణ పదవీ విరమణ కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా సత్యనారాయణ దంపతులను ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బుంగా రామారావు, పాఠశాల హెచ్‌ఎం మామిడాడ వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు పెదపూడిలో గడప గడపకూ మన ప్రభుత్వం

పెదపూడి: పెదపూడి గ్రామంలో శనివారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే డాక్టర్ సత్తిసూర్యనారాయణ రెడ్డి నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ వీవీ సాయిబాబా తెలిపారు. ఆయన పెదపూడిలో మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి వివిధ శాఖల అధికారులు, వలంటీర్లు హాజరు కావాలని కోరారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగున్నరేళ్ల కాలంలో ఏ కుటుంబానికి ఎంత లబ్ధి చేకూరిందో ఎమ్మెల్యే వివరిస్తారని పేర్కొన్నారు.

గుమ్ములూరులో 574 మందికి వైద్యసేవలు

మధురపూడి: రాష్ట్రాన్ని ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంకల్పమని ఏఎంసీ చైర్మన్ నక్కా రాంబాబు అన్నారు. కోరుకొండ మండలం గుమ్ములూరులో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటేనే అభివృద్ధి సాధ్యమన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వైద్య రంగాన్ని అభివృద్ధి చేశారన్నారు. కాగా. శిబిరంలో 574 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వారిలో 29 మందిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు రిఫర్ చేశారు. కోటి కేశవరం పీహెచ్‌సీ డాక్టర్ పుణ్య శాంతి, దోసకాయలపల్లి పీహెచ్‌సీ డాక్టర్ కోటేశ్వరరావు వైద్యసేవలు అందించారు. కార్యక్రమంలో కోరుకొండ తహసీల్దార్ పాపారావు, గుమ్ములూరు మాజీ సర్పంచ్ మట్టా వెంకటేశ్వరరావు, సెక్రటరీ టి.జాకబ్ రాజు, అలేఖ్య పాల్గొన్నారు.


32 పాఠశాలల్లో ఎస్‌ఈఏ సర్వే

రాజానగరం: మండలంలోని 32 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్‌మెంట్ సర్వే నిర్వహించామని ఎంఈఓలు రామన్న దొర, జ్యోతి ప్రసాద్ తెలిపారు. వీటి ఆధారంగా మూడు, ఆరు, తొమ్మిదో తరగతి విద్యార్థులలో సామర్థ్యాలు ఏవిధంగా ఉన్నాయి, మెరుగుపర్చడానికి తీసుకోవాల్సిన చర్యలు, ఉపాధ్యాయులకు అవసరమైన శిక్షణ మున్నగు అంశాలపై ఎస్‌సీఈఆర్టీ ప్రణాళికలను తయారుచేస్తుందన్నారు.

బూత్ స్థాయిలో ఓటరు నమోదు

బిక్కవోలు: మండలంలోని శని, ఆదివారాలు బూత్ స్థాయిలో ఓటరు నమోదు చేస్తున్నట్టు అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, తహసీల్దార్ పోసిబాబు అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని 58 పోలింగ్ స్టేషన్లలోని బూత్ లెవల్ అధికారులు అందుబాటు ఉంటారన్నారు. ఓటరు జాబితాలో సవరణలు అవసరమని భావిస్తే, దరఖాస్తు చేసుకోవాలన్నారు. వచ్చే ఏడాది జనవరి ఒకటి నాటికి 18 ఏళ్లు ఉన్నవారు, ఇప్పటివరకూ దరఖాస్తు చేసుకోని వారు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

బాణసంచా తయారీ కేంద్రాల పరిశీలన



బిక్కవోలులో ఫైర్‌వర్క్స్‌ను పరిశీలిస్తున్న అధికారులు

బిక్కవోలు: మండలంలోని బాణసంచా తయారీ కేంద్రాలను అధికారులు పరిశీలించారు. శుక్రవారం బిక్కవోలులోని గోలింగేశ్వర ఫైర్‌వర్క్స్‌ను తహసీల్దార్ పోసిబాబు, ఎస్సై బి.బుజ్జిబాబు, అనపర్తి ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసరెడ్డి తదితరులు సందర్శించారు. తహసీల్దార్ మాట్లాడుతూ బాణసంచా తయారీలో నిర్లక్ష్యం వహిస్తే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

బీజేపీ సమావేశం

రాజానగరం: నియోజకవర్గ బీజేపీ ప్రవాస్ యోజన సమావేశం శుక్రవారం నరేంద్రపురంలో జరిగింది. కో కన్వీనర్ గండి సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర బీజేపీ ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి, జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు, ప్రవాస్ యోజన జిల్లా కన్వీనర్ కురగంటి సతీష్, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు మద్దిపాటి రజనీ పాల్గొన్నారు.

ఆటకు ఊతం

- అన్ని ప్రభుత్వ పాఠశాలలకు క్రీడా పరికరాలు
- విద్యార్థులు క్రీడాకారులుగా ఎదిగేందుకు దోహదం
- వ్యాయామ విద్యకు జగన్ ప్రభుత్వం పెద్ద పీట
- అనపర్తి నియోజకవర్గంలో 181 స్కూళ్లకు పంపిణీ

మండలం	ప్రాథమిక	యూపీ	ఉన్నత (పాఠశాలలు)
అనపర్తి	31	3	10
పెదపూడి	46	0	14
బిక్కవోలు	30	1	8
రంగంపేట	34	4	10
మొత్తం	141	8	42

పెదపూడి: ప్రభుత్వ పాఠశాలల్లో వ్యాయమ విద్యకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పెద్దపీట వేసింది. ఫిజికల్ ఎడ్యుకేషన్‌ను ఓ సబ్జెక్టుగా పరిగణించాలని ఇప్పటికే ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇందులో భాగంగానే ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలకు పెద్దఎత్తున క్రీడా సామగ్రిని సరఫరా చేసింది. గత ప్రభుత్వ హయాంలో క్రీడా పరికరాల కోసం తూతూమంత్రంగా ఏటా రూ.500 నుంచి రూ.1000 మాత్రమే మంజూరయ్యేవి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఇప్పుడు వేలాది రూపాయలు ఖర్చు చేసి, నాణ్యమైన క్రీడా సామగ్రిని పాఠశాలలకు సరఫరా చేసింది. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు క్రీడాకారులుగా ఎదిగేందుకు ఇదెంతో దోహదం చేస్తోంది. అనపర్తి నియోజకవర్గంలోని అనపర్తి, బిక్కవోలు, పెదపూడి, రంగంపేట మండలాల్లో మొత్తం 181 పాఠశాలలు ఉన్నాయి.

సరఫరా చేసిన క్రీడా పరికరాలివే..

- ప్రాథమిక పాఠశాలలకు వాలీబాల్, హ్యాండ్‌బాల్, క్రికెట్ బ్యాట్, వికెట్స్ సెట్, టెన్నిస్ బాల్, ఫ్రిస్బీ, మల్టీ కలర్ హులా హూప్స్, స్టెప్ హర్డిల్స్, స్కిప్పింగ్ రోప్.
- ప్రాథమికోన్నత పాఠశాలలకు బాస్కెట్‌బాల్, బాలీబాల్, త్రోబాల్స్, టెన్నికాయిట్, టెన్నికాయిట్ రింగ్, టెన్నికాయిట్‌నెట్, స్కిప్పింగ్ రోప్స్, చెస్ సెట్, వేయింగ్ మిషన్, షాట్‌పుట్, డిస్కస్ రబ్బర్, స్టెప్ హార్డ్‌స్, ఫ్రిస్బీ
- ఉన్నత పాఠశాలలకు హ్యాండ్‌బాల్స్, వాలీబాల్స్, వాలీబాల్ నెట్, త్రోబాల్స్, త్రోబాల్ నెట్, టెన్నికాయిట్స్, టెన్నికాయిట్ నెట్, స్కిప్పింగ్ రోప్స్, యోగా మ్యాట్స్, చెస్‌సెట్, ఫుట్ ఎయిర్ పంప్, ఫుట్‌బాల్, వేయింగ్ మిషన్, షాట్‌పుట్, డిస్కస్‌త్రో, మెజరింగ్ టేప్ తదితర వస్తువులు ఉన్నాయి.



క్రీడా సామగ్రితో సంపర పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు

పీడీ, పీఈటీలకూ కాంప్లెక్స్‌లు

నియోజకవర్గ స్థాయిలో విద్యా వ్యవస్థలో మొదటిసారి పీడీ, పీఈటీలకు స్కూల్ కాంప్లెక్స్‌లు ఏర్పాటు చేశారు. ఈ వ్యవస్థ ఏర్పడినప్పటి నుంచి కేవలం సబ్జెక్టు టీచర్లకు మాత్రమే కాంప్లెక్స్‌లు ఉండేవి. నియోజకవర్గం కేంద్రంగా ఒక కాంప్లెక్స్ ఏర్పాటు ద్వారా వ్యాయామ విద్యకు ప్రాధాన్యమిచ్చి, తమకు శిక్షణ ఇవ్వడం శుభసూచికమని పీడీలు, పీఈటీలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



పాఠశాలలకు సరఫరా చేసిన క్రీడా పరికరాలు

స్కూళ్లకు శుభపరిణామం



క్రీడలను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం క్రీడా సామగ్రి సరఫరా చేసింది. గతంలో ఎప్పుడూ లేనివిధంగా విద్యార్థుల కోసం ప్రతి పాఠశాలకు క్రీడా పరికరాలు పంపిణీ చేసిన ప్రభుత్వానికి పీడీలు, పీఈటీల తరఫున కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం. రాష్ట్ర స్థాయి క్రీడల్లో పాల్గొనే విద్యార్థులకు రవాణా ఖర్చుల కోసం కొంత మేర నగదు అందజేయడం శుభపరిణామం.

– బీవీటీ రాజు, పీఈటీ, గాంధీ మెమోరియల్ గవర్నమెంట్ హైస్కూల్, పెదపూడి

ఈ ప్రోత్సాహం మరువలేనిది



క్రీడాకారులను ప్రోత్సహించడానికి రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషి మరువలేనిది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. నేను అండర్–14 కబడ్డీలో జిల్లా స్థాయిలో రాణించి, రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యాను. మా ప్రాక్టీస్‌కు అవసరమైన సామగ్రి ఇవ్వడం చాలా ఆనందంగా ఉంది.

– డి.చిన్నారి, కబడ్డీ క్రీడాకారిణి, సంపర జెడ్పీ హైస్కూల్

సంపర జెడ్పీ స్కూల్‌కు రూ.2 లక్షల విరాళం



హెచ్‌ఎం త్రిమూర్తులుకు విరాళం అందజేస్తున్న దాతలు

పెదపూడి: విద్యాభివృద్ధికి దాతల సహకారం అవసరమని సంపర జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం త్రిమూర్తులు అన్నారు. జెడ్పీ ఉన్నత పాఠశాలకు ఇదే గ్రామానికి చెందిన బోడ సూర్యనారాయణ, బోడ వీరరాఘవులు వారి తల్లిదండ్రులు బోడ వెంకటేశ్వరరావు, ధనలక్ష్మి జ్ఞాపకార్థం రూ.2 లక్షల విరాళం ప్రకటించారు. ఆ విరాళంతో పాఠశాలకు గ్రిల్స్ వేయించనున్నారు. హెచ్‌ఎం త్రిమూర్తులు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావుకు దాతలు ఈ విరాళం అందజేశారు. కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు అద్దంకి బాబులు, అద్దంకి భద్రరావు, ఉపాధ్యాయుడు సమ్మంగి శ్రీరాములు, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ మట్టా రామఅయ్యన్న, సలాది విమల తదితరులు దాతలను అభినందించారు.

చెట్ల కొమ్మల తొలగింపు

మధురపూడి: కోరుకొండ మండలం బూరుగుపూడి సబ్ స్టేషన్ పరిధిలోని 33/11 కేవీ లైన్ విద్యుత్ స్తంభాల కింద చెట్ల కొమ్మల తొలగింపు పనులు శుక్రవారం జరిగాయి. ఈపీడీసీఎల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పనుల కారణంగా మధ్యాహ్నం 11.30 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ సరఫరాకు అంతరాయం కలిగింది.

సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యం

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- సీతానగరంలో 'జగనన్నకు చెబుతాం'
- 370 అర్జీల స్వీకరణ



సీతానగరంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, జేసీ తేజ్ భరత్

మధురపూడి: ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. సీతానగరం జీవీకే ఫంక్షన్ హాలుల్లో శుక్రవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో సమస్యలను తెలుసుకుని, వాటిని అక్కడికక్కడే పరిష్కారం చూపుతున్న ఘనత ఈ ప్రభుత్వానికే దక్కిందన్నారు. ప్రజల బాగోగులను తెలుసుకోవడానికి ప్రజా ప్రతినిధులను నిత్యం ప్రజల్లోనే ఉంటున్నారన్నారు.

చంద్రబాబు తీరు దారుణం

అనారోగ్యం పేరుతో మధ్యంతర బెయిల్ పొందిన చంద్రబాబు.. ప్రభుత్వంపై విమర్శలు చేయడం దారుణమని ఎమ్మెల్యే రాజా అన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేకే ఆయన నిందారోపణలు చేస్తున్నారని విమర్శించారు. న్యాయస్థానం మానవతా దృక్పథంతో ఇచ్చిన బెయిల్‌ను సైతం రాజకీయాలకు వాడుకోవడం దుర్మార్గమన్నారు. రాజమహేంద్రవరం నుంచి ర్యాలీ, మీడియాతో మాట్లాడటం తదితర కోర్టు షరతులను లెక్కచేయకపోవడం సరికాదని ఆయన హితవు పలికారు. జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్ మాట్లాడుతూ స్పందన, జగనన్నకు చెబుదాం కార్యక్రమాల ద్వారా ప్రజల సమస్యలను సంపూర్ణంగా పరిష్కరిస్తున్నట్టు తెలిపారు. జిల్లాలోని 18 మండలాల్లో ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. 2023 మే నుంచి ఇప్పటి వరకూ 9,294 జేకేసీ కాల్స్ రిసీవ్ చేసుకుని 8,540 కాల్స్‌కు సంబంధించిన సమస్యలు పరిష్కరించామని, 91.89 శాతం సాధించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో 370 అర్జీలు స్వీకరించామన్నారు. కార్యక్రమంలో పర్యాటక శాఖ ప్రాంతీయ సంచాలకులు వి.స్వామి నాయుడు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు ఎం.భాను ప్రకాశ్ రెడ్డి, పి.సువర్ణ, డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ వెంకటేశ్వరరావు, వ్యవసాయశాఖ ఏడీ బీకే మల్లికార్జునరావు, పశుసంవర్ధకశాఖ అధికారి ఎస్‌జీటీ సత్య గోవిందం, డ్వామా పీడీ పి.జగదాంబ, స్త్రీ,శిశు సంక్షేమ శాఖ కె.విజయకుమారి, సివిల్ సప్లయి జిల్లా మేనేజర్ వి.నాగార్జున రెడ్డి, డీఈఓ కె.అబ్రహం, డీఎల్‌పీఓ వీణాదేవి తదితరులు పాల్గొన్నారు.

తాకూరుపాలెంలో అగ్నిప్రమాదం

గోకవరం: గంగంపాలెం పంచాయతీ పరిధిలోని తాకూరుపాలెంలో గురువారం అర్ధరాత్రి అగ్నిప్రమాదం సంభవించింది. గ్రామానికి చెందిన వేలంపర్తి చిన్నయ్యదొర ఇంటి నుంచి అర్ధరాత్రి సమయంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఇంట్లో ఉన్న వారు వెంటనే బయటకు వచ్చి స్థానికుల సహాయంతో మంటలు అదుపు చేసే ప్రయత్నం చేసినప్పటికీ మంటలు పూర్తిగా వ్యాపించాయి. ఈ ప్రమాదంలో ఇంట్లో సామగ్రి పూర్తిగా కాలిపోయింది. బీరువాలో ఉంచిన రూ.లక్ష నగదు సైతం అగ్నికి ఆహుతైనట్టు బాధితులు తెలిపారు. విషయం తెలుసుకున్న సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు సుంకర వీరబాబు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు దొడ్డి నాగేశ్వరరావు, తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ శుక్రవారం బాధితులను పరామర్శించి నగదు, బియ్యం, ఇతర నిత్యావసరాలను పంపిణీ చేశారు. బాధితులను ప్రభుత్వపరంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ నేత జ్యోతుల రామస్వామి అగ్నిప్రమాద బాధితులను పరామర్శించి రూ.5 వేలు, 50 కేజీల బియ్యం, దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ టౌన్ కన్వీనర్ చింతల అనిల్‌కుమార్, తోలేటి రాంప్రసాద్, బాడితబోయిన చిన్న, నండూరి బుజ్జి, తాటికొండ సురేష్ తదితరులు పాల్గొన్నారు.



బాధితులకు నగదు, నిత్యావసరాలు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

బాల్ బ్యాడ్మింటన్ జిల్లా జట్టుకు బాలికల ఎంపిక



క్రీడాకారులను అభినందిస్తున్న హెచ్‌ఎం వెంకటరెడ్డి, ఉపాధ్యాయులు

అనపర్తి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా జట్టుకు బాల్ బ్యాడ్మింటన్ విభాగంలో స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన ఇరువురు విద్యార్థినులు ఎంపికైనట్టు పాఠశాల హెచ్‌ఎం పి.వెంకటరెడ్డి తెలిపారు. అండర్–19 బాల్ బ్యాడ్మింటన్ విభాగంలో పాఠశాలకు చెందిన అల్లం దీపిక, అండర్–14 విభాగంలో ఎస్.రేష్మ తమ ప్రతిభతో ఎంపికయ్యారని చెప్పారు. వీరు ఈ నెల 5 వరకు నెల్లూరు జిల్లా ఆత్మకూరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. వీరిని హెచ్‌ఎంతో పాటు పీఈటీ టీవీవీఎస్ రాఘవరెడ్డి, ఎన్.శ్రీనివాస్, ఉపాధ్యాయులు అభినందించారు.



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు బిక్కవోలు క్రీడాకారుల ఎంపిక

బిక్కవోలు: రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు తమ క్రీడాకారులు ఎంపికైనట్టు బిక్కవోలు ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పల్లా వీరప్రభాకరరావు తెలిపారు.శుక్రవారం ఆయన మాట్లాడుతూ పాఠశాలకు చెందిన బూడి ప్రసన్నభార్గవి, బండారు చాందిని శ్రియ, దుళ్ల అలేఖ్య, విసనగిరి సాయిసింధు, జామి శరణ్య ఎంపికైనట్టు చెప్పారు. ఈ నెల నాలుగు నుంచి ఏడు వరకూ నెల్లూరు జిల్లా ఆత్మకూరులో జరిగే రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అండర్–14, 17 విభాగాల్లో బాల్ బ్యాడ్మింటన్ తూర్పుగోదావరి జిల్లా జట్టు తరపున ఆడతారని తెలిపారు.

రూ.170 కోట్లతో రోడ్ల అభివృద్ధి పనులు

- జగన్ పాలనలో ప్రజా సంక్షేమానికి పెద్దపీట
- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా



రోడ్ల అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, అధికారులు

రాజానగరం: నియోజకవర్గంలో రూ.170 కోట్లతో చేపట్టిన రోడ్ల అభివృద్ధి పనులు చురుగ్గా జరుగుతున్నాయని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. ఆయా పనుల ప్రగతిని సంబంధిత అధికారులతో కలిసి శుక్రవారం ఆయన పరిశీలించారు. ఇదే సమయంలో నేషనల్ డెవలప్‌మెంట్ బ్యాంక్ సహకారంతో చేపట్టిన పనులను ప్రగతిని సంబంధిత అధికారులతో మాట్లాడి తెలుసుకున్నారు. రాజానగరం జంక్షన్ నుంచి కలవచర్ల, సీతారామపురం, గాదరాడ మీదుగా జరుగుతున్న రోడ్డు పనులను, కోరుకొండ, ముగ్గళ్ల రోడ్డు విస్తరణ పనులను, ఇరువైపులా నిర్మిస్తున్న సీసీ డ్రైన్లు, ఆర్‌డబ్ల్యూఎస్ పైపులైను పనులను నిశితంగా పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ గడచిన నాలుగేళ్లలో ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం పెద్ద పీట వేసిందన్నారు. ఇదే తరుణంలో నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి పనులకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో కోట్లాది రూపాయల నిధులు తీసుకురాగలిగామన్నారు. అనేక ప్రాంతాలలో దీర్ఘకాలికంగా ఉన్న రోడ్ల సమస్యలను పరిష్కరిస్తూ, మండలానికి, గ్రామాలకు ఉన్న లింకురోడ్లను కూడా పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయగలుతున్నామన్నారు.

నివాస స్థలాల పరిశీలన

సీతానగరం మండలం రఘుదేవపురం, రాపాక, కూనవరాల్లో నవరత్నాల పథకంలో భాగంగా అర్హులైన పేదలకు త్వరలోనే నివాస స్థలాలు అందజేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఇందుకు సంబంధించి సేకరించిన స్థలాలను జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్‌తో కలిసి జక్కంపూడి రాజా పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ డీఈ మధుసూదనరావు, వివిధ శాఖల అధికారులు, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన కాకినాడ ఆర్డీఓ



ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డికి మొక్కను ఇస్తున్న ఆర్డీఓ కిషోర్

అనపర్తి: కాకినాడ ఆర్డీఓగా కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఇట్ల కిషోర్ శుక్రవారం ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం అనపర్తి వచ్చిన ఆర్డీఓ కిషోర్ ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డిని కలిసి మొక్కను అందించారు.

కాకినాడకు వెళ్లి పింఛను అందజేత



హరిబాబుకు పింఛను అందజేస్తున్న వలంటీర్ ప్రసన్నకుమారి

అనపర్తి: గ్రామంలోని సచివాలయం–5 పరిధిలో పింఛను పొందుతున్న లబ్ధిదారుడు కొప్పిశెట్టి హరిబాబు మెదడులో బ్లడ్‌క్లాట్ కావడంతో పక్షవాతం బారినపడి కాకినాడ జీజీహెచ్‌లో కొంతకాలంగా చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న వలంటీర్ పిల్లి విజయదుర్గా ప్రసన్నకుమారి శుక్రవారం కాకినాడ జీజీహెచ్‌కు వెళ్లి హరిబాబుకు పింఛను సొమ్ము అందజేశారు.

నేటి నుంచి ప్రత్యేక ఓటర్ల నమోదు


రంగంపేట: మండలంలోని అన్ని పోలింగ్ బూత్‌ల వద్ద శని, ఆదివారాల్లో ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమం ఏర్పాటు చేసినట్టు ఇన్‌చార్జి తహసీల్దార్ ఎం.దొరకయ్య తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జనవరి ఒకటి నాటికి 18 ఏళ్లు నిండిన వారు ఓటరు నమోదు చేయించుకోవచ్చన్నారు. ఓటు నమోదు, సవరణలు తదితర ఫారాలు పోలింగ్ బూత్ వద్ద ఉచితంగా అందజేస్తారని తెలిపారు.

కుల దూషణ కేసు నమోదు

బిక్కవోలు: ఓ వ్యక్తిని కులం పేరుతో దూషించినట్టు కేసు నమోదు చేశామని ఎస్సై పి.బుజ్జిబాబు శుక్రవారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. గత సెప్టెంబర్ 21న బిక్కవోలుకు చెందిన గరగ వెంకటరాజు రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. అతడిని పరామర్శించేందుకు అదే గ్రామానికి చెందిన దూళ్ల రత్నరాజు తన మిత్రులతో కలిసి వెళ్లాడు. అదే సమయంలో జల్లూరి వెంకన్నబాబు అనే వ్యక్తి రత్నరాజును కులం పేరుతో దూషించి, చంపుతానని బెదిరించాడు. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

విద్యార్థులకు సీస్ పరీక్ష

బిక్కవోలు: మండలంలో స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్‌మెంట్ సర్వే(సీస్) పరీక్షను శుక్రవారం నిర్వహించారు. మొత్తం 21 పాఠశాలల్లో 3, 6, 9 తరగతి విద్యార్థులకు పరీక్షలు జరిగాయి. కొంకుదురు ఉన్నత పాఠశాలలో 6, 9 తరగతులకు చెందిన 49 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తారని హెచ్‌ఎం మల్లిపూడి శ్రీనివాస్ తెలిపారు. బిక్కవోలులోని డిగ్రీ కళాశాలకు చెందిన ద్వారంపూడి శిరీష, మండ శ్రీలక్ష్మి ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లుగా వ్యవహరించారు.



కొంకుదురులో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

అంకిత భావంతో అద్భుత విజయాలు

రాజమహేంద్రవరం సిటీ: అంకిత భావంతో పనిచేస్తే, ఏ రంగంలోనైనా అద్భుత విజయాలు సాధించవచ్చని మాజీ క్రికెటర్ అంబటి రాయుడు అన్నారు. శుక్రవారం నగరంలోని కంబాల చెరువు పార్కు, పుష్కర్ ప్లాజాలను ఎంపీ మార్గాని భరత్ రామ్‌తో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పర్యటిస్తూ పరిస్థితులను పరిశీలిస్తున్నానని, త్వరలో రాజకీయాల్లోకి అడుగు పెడతానన్నారు. రాజమహేంద్రవరాన్ని ఎంపీ భరత్ రామ్ చక్కగా అభివృద్ధి చేస్తున్నారన్నారు. భారత్ క్రికెట్ జట్టు చాలా బాగా ఆడుతోందని, అదే ఒరవడి కొనసాగిస్తుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. యువత క్రీడారంగంపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. ఎంపీ భరత్‌రామ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి రాష్ట్రంలో క్రీడాభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యకర సమాజం



పౌష్టికాహార కిట్లు అందజేస్తున్న కృష్ణారెడ్డి, గంగాభవాని

అనపర్తి: గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యకర సమాజానికి దోహదపడుతుందని అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం రామవరం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో టేక్ హోమ్ రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. రామవరం సర్పంచ్ గిరడా గంగాభవానితో కలిసి కృష్ణారెడ్డి.. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం కిట్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ మాతా, శిశు మరణాల నివారణ, రక్తహీన సమస్యను అధిగమించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందిస్తున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ నందీశ్వరి, ఎంపీటీసీలు నల్లమిల్లి భాగ్యలక్ష్మి, గొలుగూరి గౌతమి, పంచాయతీ సభ్యులు జుత్తుక సత్యవేణి, కర్రి రామచంద్రారెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

గ్రామాల్లో కోతుల వీర విహారం

రంగంపేట: మండల కేంద్రమైన రంగంపేటతో పాటు చంద్రేడు, పెదరాయవరం గ్రామాల్లో కోతులు వీరవిహారం చేస్తున్నాయి. ప్రధాన రహదారుల్లో హల్‌చల్ చేస్తూ గ్రామస్తులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. చెట్లు ధ్వంసం చేస్తూ, ఇళ్లలోని సరుకులు పాడుచేస్తున్నాయి. ఇంటి పెంకులు, రేకులను ఊడపీకుతున్నాయి. పిల్లలు, మహిళలపై దాడి చేస్తున్నాయి. ఏం చేయాలో తెలియక గ్రామస్తులు తలలు పట్టుకుంటున్నారు. కోతుల బెడదను నివారించాలని అధికారులను కోరుతున్నారు.

చంద్రేడులో రోడ్డు పక్కన కోతుల సమూహం

